RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 448 | 13 గురువారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--




### డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..

# భారీ పెట్టుబడులే లక్ష్యం

తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఏడాది సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సదస్సు ద్వారా ప్రపంచస్థాయి పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంస్థాగత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గత ఏడాది సదస్సు తర్వాత తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని పెట్టుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇదే సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్షించారు. పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో పనులకు టెండర్ల



ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పెండింగ్ భూసేకరణను పూర్తి చేసి విస్తరణ ప్రణాళికలను ఖరారు చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ మెట్రో మార్గంలో అనుసరించాల్సిన సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని సూచించారు.

## తెలంగాణలో రేపే 'ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల' పథకం ప్రారంభం

### : నియోజకవర్గానికి వెయ్యి మందికి లబ్ధి



రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బీసీ) మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా ఆటోమేటిక్ కుట్టు మిషన్లు పంపిణీ చేసే సరికొత్త సంక్షేమ పథకాన్ని రేపు అధికారికంగా ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. శ్రమను తగ్గించి, వేగంగా పని చేసుకునేందుకు వీలుగా ఈ అధునాతన ఆటోమేటిక్ మిషన్లను అందించబోతున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో వెయ్యి మంది మహిళలకు మిషన్లు అందించబోతున్నారు. లబ్ధిదారుల వయోపరిమితి, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి, అవసరమయ్యే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల వివరాలను మంత్రి రేపు అధికారికంగా వెల్లడిస్తారు. ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించే తేదీలను, ప్రక్రియ మార్గదర్శకాలను ప్రకటించనున్నారు.

## గోదావరి జలాల వినియోగంపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటి ఎత్తిపోతల (లిఫ్ట్) ప్రక్రియను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నీటిపారుదల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సిఫార్సుల మేరకు ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిల్వ చేయడం లేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలలో కొన్ని లోపాలను గుర్తించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించగా, ఈ అంశంపై తక్షణమే ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం సూచించారు. దేవాదుల ప్రాజెక్టులో తొమ్మిది పంపుల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం కీలకమని, అక్కడ ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, పెండింగ్ పరిహారం, పునరావాస ప్యాకేజీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు అందజేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన పరిహారం చెల్లిస్తేనే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులను నింపడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. గట్టు, గుడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుపై తగిన అధ్యయనం చేయాలని, గుడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మీరు కొంచెం మారారు : మోదీతో ఖర్గే సరదా వ్యాఖ్య

రాజకీయాల్లో నిత్యం విమర్శలు, ప్రతివిమర్శలతో తలపడే అగ్ర నేతలు, ఒకే వేదికపై ఆత్మీయంగా పలకరించుకోవడం అందరినీ ఆకట్టుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ రాహుల్ గాంధీల మధ్య చోటుచేసుకున్న ఓ సరదా సంభాషణకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే కుమార్తె రేవతి సూలే వివాహ రిసెప్షన్ ఇటీవల ఢిల్లీలో ఘనంగా జరిగింది. శరద్ పవార్ నివాసంలో నిర్వహించిన ఈ వేడుకకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో కరచాలనం చేయడంతో పాటు, ప్రియాంక గాంధీని "ఎలా ఉన్నారు?" అని ఆత్మీయంగా పలకరించారు. "నేను బాగున్నాను సర్,



మీరు ఎలా ఉన్నారు" అని ప్రియాంక గాంధీ అడగడంతో, నేను ఎప్పటిలాగే ఉన్నాను అని ప్రధాని మోదీ అన్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకుంటూ, ప్రధాని మోదీని ఉద్దేశించి "ఆప్ థోడా సా బదల్ గయే హో" (మీరు మునుపటి కంటే కొంచెం మారారు) అని చిరునవ్వుతో వ్యాఖ్యానించారు. దీనికి మోదీ ఆశ్చర్యపోతూ "అవునా?" అని బదులిచ్చి, ఖర్గే భుజంపై చేయి వేసి నవ్వారు. వీరి మధ్య జరిగిన ఈ ఆసక్తికర సంభాషణను చూసి రాహుల్ గాంధీ కూడా నవ్వడం వీడియోలో కనిపిస్తోంది. సుప్రియా సూలే కుమార్తె రేవతి, నాగ్‌పూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త సారాంగ్ లఖానీల వివాహం ఈ ఏడాది జూన్‌లో ముంబైలో జరిగింది. తాజాగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఈ రిసెప్షన్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సోనియా గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. రాజకీయంగా తీవ్ర వైరుధ్యాలు ఉన్నప్పటికీ, నేతల మధ్య కనిపించిన ఈ స్నేహపూర్వక వాతావరణం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## మహమ్మద్ అలీ జిన్నా.. రాహుల్ గాంధీ రూపంలో మరలా జన్మించారు : బీజేపీ ఎంపీ



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాకిస్థాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నా, రాహుల్ గాంధీ రూపంలో పునర్జన్మించారని, జిన్నా కంటే కూడా రాహుల్ అత్యంత ప్రమాదకరమైన నాయకుడని బుధవారం ఆయన విమర్శించారు. ఈ మేరకు తన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఝార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన నిరసనల నేపథ్యంలో దూబే ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కుంభకోణంపై సీబీఐ విచారణను కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకిస్తోందని ఆయన నిలదీశారు. ప్రధాన నిందితుడు ఝార్ఖండ్ ప్రభుత్వంలోని ఒక సీనియర్ అధికారి నివాసంలో పట్టుబడ్డాడని, ఒకవేళ సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా జరిగితే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు కూడా చిక్కులు తప్పవని ఆరోపించారు. విద్యార్థులకు నిజంగా సంఘీభావం తెలపాలనుకుంటే ఝార్ఖండ్ ప్రభుత్వానికి కాంగ్రెస్ తన మద్దతును వెంటనే ఉపసంహరించుకోవాలని దూబే సవాల్ విసిరారు. లేనిపక్షంలో ఆ పార్టీ జార్జ్ సోరోస్ అజెండాతో పనిచేస్తున్నట్లు భావించాల్సి ఉంటుందని అన్నారు. ప్రధానికి వ్యతిరేకంగా ఎక్కడ నిరసనలు జరిగినా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షమవుతున్నారని ఆయన మండిపడ్డారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థులు 19 రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, వివాదాస్పద పరీక్షల రద్దు, స్వతంత్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ముట్టడికి యత్నించిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్, వాటర్ కేనన్లు, బాష్పవాయువు ప్రయోగించడంతో బీజేపీ రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని బీజేపీ పట్టుబడుతుండగా, చర్చల ద్వారా సమస్యను పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది.

### మేం 'టీ-హబ్' కడితే..

## రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు

### : కేటీఆర్



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేశారు. సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెస్సారక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 'అనుముల హబ్స్' ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం ఈ అంశంపై 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ స్పందించారు. "తాము నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం కుటుంబ సభ్యులతో నడిచే, సున్నా ఆవిష్కరణలు, సున్నా ఉద్యోగులతో కూడిన స్కామ్.. అదేనండీ స్కీమ్ అయిన 'అనుముల హబ్స్' సృష్టిస్తున్నారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు, ఎలాంటి ప్రశ్నలు లేకుండా చౌక ధరకే ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. సున్నా పెట్టుబడితో రాత్రికి రాత్రే రూ. 200 కోట్లు సంపాదించినందుకు అనుముల కొండల్ రెడ్డిని 'శతాబ్దపు ఆవిష్కర్త'గా ప్రకటించాలి" అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. కేవలం రూ. లక్ష చెల్లింపు మూలధనం, సున్నా ఉద్యోగులు ఉన్న కంపెనీకి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. సుమారు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకే, అంటే గజం రూ. 3,700 చొప్పున కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి కోట్లాది రూపాయలు సంపాదించే ఈ మ్యాజిక్ ట్రిక్‌ను కేవలం అనుముల కుటుంబానికే పరిమితం చేయకుండా తెలంగాణ యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి అన్నారు. టెస్సారక్ట్ సంస్థతో సీఎం సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. కొండల్ రెడ్డి లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్‌లో ఆయన్ను టెస్సారక్ట్ ఛైర్మన్‌గా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ భూ కేటాయింపులకు సంబంధించిన జీవో, భూమి విలువ, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు వంటి అన్ని పత్రాలను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూ కేటాయింపుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, దీనిపై ముందుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులను శిక్షించే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు.

# భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం మహనీయుల ఆశయాలను సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్ళుదాం

- దేశం కోసం ప్రజల కోసం తన కుటుంబాన్ని త్యాగం చేసిన అంబేద్కర్ గారి చిత్రపటాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించాలి.

- మనువాద శక్తుల నుండి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం.

**అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య**

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్

టేకుమట్ల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల కన్వీనర్ మారపెల్లి కొంరయ్య అధ్యక్షతన జరిగిన సంఘం సమావేశం లో అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య పాల్గొని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నాటి కాలంలో అశృష్యత అంటరాని తనం కుల వివక్షత ఎక్కువగా ఉండేదని వాటిని రూపుమాపి ప్రజలలో చైతన్యం తీకువచ్చిన మహనీయుల ఆశయాలు, సిద్ధతాలను ముందుకు తీసుకెళ్ళామన్నారు దేశంలో మనువాద శక్తులు రాజ్యాంగాన్ని తొలగించాలని చూస్తున్నందున. అన్ని వర్గాల ప్రజలము ఏకమై భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని అన్నారు.సమాజంలో కుల మతాలకు అతీతంగా ఆన్ని కులాలకు మతాల ప్రజలకు అంబేద్కర్ గారు హక్కులు రిజర్వేషన్లు కల్పించారని, వాటి ద్వారా ఉద్యోగాలు పొంది స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. దేశం కోసం ప్రజల కోసం తన కుటుంబాన్ని త్యాగం చేసి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు బాబాసాహెబ్ అంబేద్కర్ గారని ఆ మహనీయుని చిత్రపటాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించాలని డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం భూపాల్ పల్లి నియోజకవర్గ కన్వీనర్ అరకొండ రాజయ్య టేకుమట్ల మండల ఉపాధ్యక్షులు పారనంది రాములు



నాయకులు అరకొండ రాకేష్ యుగేందర్ పాల్గొన్నారు

# గండ్ర పరామర్శ...

తేది:12.08.2026, హైదరాబాద్

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్



రేగొండ మండలం జూబ్లీ నగర్‌కు చెందిన ఆరుట్ల మహేందర్ గారు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలుకు తీవ్ర గాయం కాగా,కాలికి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేందర్ గారిని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు

---



భారత ప్రధాని గౌరవ శ్రీ నరేంద్ర మోడీ గారు ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర మరియు దేశ ప్రజలందరూ వారి వారి ఇంటి పైన జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, బిజెపి కాంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి,మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియుస్టేషన్ ఘన్పూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు గారు విజ్ఞప్తి చేసినారు. ఈ కార్యక్రమం దేశ ప్రజలలో కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ సమన్వయంతో సోదర భావం కలిగి కలిసి మెలిసి ఉండ డానికి దోహద పడుతుందని అన్నారు. భారతదేశ ప్రజలు భారత దేశ చరిత్రను తెలుసు కోవడానికి హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. స్వాతంత్రం కొరకు అసువులు బాసిన మహనీయుల చరిత్రను తెలుసు కోవడానికి మరియు ఎంతమంది త్యాగాల పునాదుల మీద నిలబడ్డ భారత దేశ స్వతంత్రం గురించి తెలుసుకోవడానికి హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉపయోగపడుతుందని,భారతదేశ ప్రజలకు అన్ని విషయాల మీద అవగాహన ఉండడానికి ఈ యొక్క కార్యక్రమం చేపట్టడం జరిగిందని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బిజెపి ఎమ్మెల్యే కాంటెస్టేడ్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు స్టేషన్ఘన్పూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు గారు విజ్ఞప్తి చేసినారు.

# ముమ్మిడివరం యువకుడి మోడలింగ్‌లో సత్తా

## ‘ గెలాక్సీ ఆఫ్ సౌత్ ఇండియా విన్నర్’గా బండారు రామ్ కుమార్

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్

అమలాపురం: కోనసీమ ప్రాంతానికి చెందిన యువకుడు బండారు రామ్ కుమార్ మోడలింగ్ రంగంలో తన ప్రతిభను చాటుకున్నారు. అమలాపురం సమీపంలోని ముమ్మిడివరం వాసి అయిన రామ్ కుమార్ ఇటీవల ప్రతిష్ఠాత్మకమైన 'గెలాక్సీ ఆఫ్ సౌత్ ఇండియా విన్నర్' టైటిల్‌ను కైవసం చేసుకుని తన సత్తాను నిరూపించుకున్నారు.వ్యాపార కుటుంబానికి చెందిన రామ్ కుమార్ చిన్నప్పటి నుంచే వ్యాపార రంగంతో పరిచయం పెంచుకున్నారు.

ఆయన తండ్రి వ్యాపారవేత్తగా కొనసాగుతుండగా, ఆయనకు వ్యాపార కార్యకలాపాల్లో సహాయపడుతూనే తన సొంత వ్యాపారాన్ని కూడా నిర్వహిస్తున్నారు. వ్యాపార బాధ్యతలతో పాటు మోడలింగ్‌పై ఉన్న ఆసక్తిని కొనసాగిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించేందుకు కృషి చేశారు.మోడలింగ్ పట్ల రామ్ కుమార్‌కు ఉన్న ఆసక్తి, అభిరుచిని గుర్తించిన ఆయన తండ్రి ఎల్లప్పుడూ అండగా నిలిచారు. కుమారుడి కలను సాకారం చేసుకునే క్రమంలో అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందించారు. తండ్రి



అందించిన మద్దతుతో రామ్ కుమార్ మోడలింగ్ రంగంలో తన ప్రయాణాన్ని మరింత ధైర్యంగా కొనసాగించారు.

ఈ క్రమంలో ఇటీవల జరిగిన 'గెలాక్సీ ఆఫ్ సౌత్ ఇండియా' పోటీలో విజేతగా నిలిచి 'విన్నర్' టైటిల్‌ను సాధించారు. ఈ విజయం తనకు ఎంతో ప్రత్యేకమైనదని, తనపై నమ్మకం ఉంచిన తండ్రి ప్రోత్సాహం తన విజయానికి ఎంతో దోహదపడిందని రామ్ కుమార్ తెలిపారు.తన విజయానికి సహకరించిన తండ్రితో పాటు, తన ప్రయాణంలో ప్రోత్సహించిన కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, మోడలింగ్ రంగానికి చెందిన ప్రతి ఒక్కరికీ రామ్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు



తెలిపారు. భవిష్యత్తులోనూ మోడలింగ్ రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, తన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.

# సహకార రంగానికి ఊతం

## ఎన్సీడీసీ సవరణ బిల్లుకు మద్దతు

## రాజ్యసభలో ఎంపీ రవిచంద్ర




న్యూఢిల్లీ, ఆగస్టు 12 హైదరాబాద్ ఎస్టేట్:

సహకార రంగాన్ని బలోపేతం చేసి రైతులు, గ్రామీణ ప్రజలకు రుణాలు, మార్కెట్ అవకాశాలు, ఉపాధి కల్పించేలా ఎన్సీడీసీ సవరణ బిల్లు2026 దోహదపడాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. బిల్లుపై బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ తరఫున, పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సహకార వ్యవస్థ గ్రామీణ ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన, సమానమైన సంపద సృష్టికి కీలకమన్నారు. సహకార సంఘాల ద్వారా రుణాలు, సామూహిక మార్కెటింగ్, ఉత్పత్తులకు విలువ జోడింపు వంటి ప్రయోజనాలు రైతులకు అందుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో సుమారు 900 సహకార సంఘాల ద్వారా రైతులు, గ్రామీణ ప్రజలకు రుణాలు, ఇతర సహాయాన్ని అందించినట్లు సభ దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయంతోపాటు పాడి, మత్స్య, చేనేత రంగాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత కార్మికులకు భూమి, పరికరాలు, ఉత్పత్తి కేంద్రాలు, ఆర్డర్లు కల్పించాలని కేంద్రాన్ని కోరారు. మత్స్యకారులకు అవసరమైన వనరులు, పాడి రైతులకు ప్రోత్సాహం అందిస్తే గ్రామీణ కుటుంబాల ఆదాయం పెరుగుతుందని అన్నారు. గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధితోపాటు స్వయం ఉపాధికి ఆర్థిక సాయం, రుణాలు అందించాలని సూచించారు. వివిధ రాష్ట్రాల్లో వ్యవసాయ, పాడి ఉత్పత్తులకు ఉన్న డిమాండ్, మార్కెట్ ధరలు, విక్రయ అవకాశాలపై రైతులకు పూర్తి సమాచారం అందించాలని కోరారు. ప్రాథమిక సహకార సంఘాలను మరింత సమర్థవంతంగా వినియోగించి రైతులకు రుణాలు, మార్కెట్ సదుపాయాలు, సాంకేతిక సహాయం అందించాలని సూచించారు. వ్యవసాయం, పాడి, మత్స్య, ఇతర అనుబంధ రంగాలు బలోపేతమైతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం లభిస్తుందని రవిచంద్ర అన్నారు. సహకార రంగానికి బలం చేకూరేలా ఎన్సీడీసీ సవరణ బిల్లు ఉండాలని ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పది

## అన్న ప్రసాద వితరణ కమిటీ చైర్మన్ దండేట్ కార్ భగత్ జి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి చంపాపేట్:

అన్ని దానాలకన్నా అన్నదానం ఎంతో గొప్పదని శ్రీశ్రీశ్రీ మాత అన్నపూర్ణేశ్వరి ఫ్రఅన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ దండేటి కార్ భగవత్ జి (భగవాన్) అన్నారు.చంపాపేట్‌లోని నల్లపోచమ్మఎర్రపోచమ్మ దేవాలయ ప్రాంగణంలో అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దండేటి కార్ భగవత్ జి (భగవాన్) ఆధ్వర్యంలో గత 40 నెలలుగా ప్రతి అమావాస్య రోజున ఈ అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా సుమారు 500 మందికి అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమానికి సహకరించిన దాతలు, నిర్వాహకులు, భక్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రవిముదిరాజ్, సుశీల్ కుమార్, సంతోష్ లడ్డ, గణసాల వెంకటేష్ (చింటూ), ఆడేళ్ల రాజా, అండేకార్ వెంకటేష్, టింగ్లికార్ రాజేష్, కంటేకర్ తిలక్ రాజ్, కంటేకర్ విట్టల్, జమాల్‌పూర్ శివ, షానవాజ్ హుస్సేనీ, కర్నాటి మనోహర్, ఆడేళ్ల సంపత్, ఇట్టికల సాయికుమార్, ఆనగళ్ల జగదీష్, శ్రీను నాయక్, ఎడ్ల శివరామ్ రెడ్డి, రాదేకుమార్, గుర్రం పావని, ఎస్. సంజీవ్ కుమార్, తిప్పిరెడ్డి స్వాతి, డి. సుభాష్, డి. సతీష్, డి. సందీప్, డి. సూర్యన్స్, ఆకుల దీప, రేండ్ల సారయ్య, కట్టెల మనోజ్, భవాని, సాత్తిరి మహేష్, ఉపేందర్ చారి, సంగు శ్రీనివాస్, ఎం. దీపక్, మాడ కుట్నెస్, గాజుల



నవీన్ కుమార్, నల్ల దేవేందర్, సాయి సాగర్, విజయ్ కుమార్, గూడ శ్రీనివాస్, అభిలాష్, గోగిఖర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే KR నాగరాజు గారు శ్రీకారం...

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ

వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్లో పలు అభివృద్ధి పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు శుక్రవారం శ్రీకారం చుట్టారు.డివిజన్ లోని వినాయక నగర్,గణేష్ నగర్,రామకృష్ణాపురం, తిమ్మాపూర్,సత్యసాయి కాలనీలలో 3.98కోట్ల నిధులతో సిసిరోడ్లు, డ్రైనేజీతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...నియోజకవర్గ అభివృద్ధికి కోసం సీఎం రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లి అత్యధికంగా నిధులు మంజూరు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు.ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు.నియోజకవర్గంలోని ప్రతి గ్రామ,డివిజన్ కాలనీలలో రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ,తాగునీటి సౌకర్యాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రజల సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో 43వ డివిజన్ అధ్యక్షులు రాజ్ కుమార్,మాజీ కార్పొరేటర్ అరుణ విక్టర్,జిల్లా కార్యదర్శి కొమురవెల్లి



యాదవ్,కార్యదర్శి ప్రకాష్,మాజీ జెడ్పిటిసి నరేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు బాబురావు,అరుణ, శివకుమార్,రవీందర్,పెద్ద భాస్కర్, సుదాకర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు

హనుమకొండ, ఆగష్టు 12 హైదరాబాద్ ఎస్టేట్:

భీమారంలోని నియాన్ హ్యుందాయ్ మేనేజింగ్ డైరెక్టర్ బి. చంద్రశేఖర్ జన్మదినాన్ని పురస్కరించుకుని సంస్థ సిబ్బంది స్టాక్ యార్డులో మొక్కలు నాటారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. చంద్రశేఖర్ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.




కార్యక్రమంలో సర్వీస్ మేనేజర్ పడాల మహేష్, అకౌంటెంట్ రమేష్, మానవ వనరుల విభాగం చింత దేవేందర్, ఆడిటర్ ఎన్. వినయ్, ఫ్లోర్ ఇన్‌చార్జి సంతోష్, స్పేర్ పార్ట్స్ ఇన్‌చార్జి సందీప్, పీడీఐ వెంకట్, సి. ప్రసాద్, బి. మహేష్, పోచంపల్లి రఘుపతి పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
13 గురువారం ఆగస్టు 2026

# సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

## ఆగస్టు 16న పరకాలకు రేవంత్‌రెడ్డి.. భారీ సభకు తరలిరావాలి



గీసుకొండ, ఆగస్టు 12 హైదరాబాద్ ఎస్టేట్:
ఆగస్టు 16న పరకాల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనున్నాయని తెలిపారు. గీసుకొండ మండలం ఉకల్ క్రాస్‌రోడ్‌లోని ఎస్‌ఎస్ గార్డెన్‌లో గీసుకొండ, సంగెం మండలాలతో పాటు 15, 16, 17వ డివిజన్ల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 16న పరకాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

# సీతారాంపురం గ్రామంలో మార్నింగ్ వాక్.

## ప్రజల సమస్యలు, గ్రామాభ్రివృద్ధి, ఇందిరమ్మ ఇళ్లు





హైదరాబాద్ ఎస్టేట్ యాదాద్రి భువనగిరి గుండాల 12 08 2026 బుధవారం
ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు గౌరవనీయులు బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు, బుధవారం సీతారాంపురం గ్రామంలో మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ కాళీ పద్మ వెంకన్న ప్రజలను నేరుగా కలుసుకుని, ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు.అలాగే గ్రామ ప్రజల సమస్యలు, అవసరాలను నేరుగా తెలుసుకుని, వాటి వివరాలను సేకరించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలు తెలుసుకోవడం ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడడం సీతారాంపురం గ్రామ అభివృద్ధికి కృషి చేయడం
ఇదే మా బాధ్యత.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బొర్రెం వెంకట్ రెడ్డి, రామ నర్సయ్య, వార్డు మెంబర్ జోగు కిష్టయ్య, దీూా మచ్చ మల్లారెడ్డి, దీూా మొగిలిపాక భాస్కర్, మలిపెద్ది సోమిరెడ్డి, కాళీ దర్గా మల్లేశ్,మచ్చ శేఖర్, జోగు శ్రీశైలం, సురేందర్ రెడ్డి, షంషీదర్ రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పోలీస్ ప్రజా భరోసా' అవగాహన సదస్సు




హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిది,)
విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని, క్రమశిక్షణతో కూడిన ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తుంగతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ రావు, మద్దిరాల ఎస్ఐ వీరన్న పిలుపునిచ్చారు. బుధవారం మద్దిరాల మండల కేంద్రంలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో విద్యార్థులకు 'పోలీస్ ప్రజా భరోసా' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడి సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. గంజాయి, ఇతర డ్రగ్స్ వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ, వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు వహించాలని, గుర్తు తెలియని లింకులను క్లిక్ చేయవద్దని తెలిపారు. విద్యార్థినుల రక్షణ కోసం 'పోలీస్ అక్క' కార్యక్రమం ఉందని, ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని ధైర్యం చెప్పారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేసేందుకు ప్రవేశపెట్టిన 'డోర్‌స్టెప్ ఎఫ్ఐఆర్' సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తి ఉండాలి..

## ప్రతి హృదయంలో దేశభక్తి వెల్లివిరియాలి.. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి

### డా. చందుపట్ల కీర్తి రెడ్డి




హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్
భూపాలపల్లి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు, రాష్ట్ర అధ్యక్షులు శ్రీ నారపరాజు రామచంద్రరావు గారి ఆదేశాల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో హర్ ఘర్ తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు.జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ ఏడునూతుల నిషిధర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో, భూపాలపల్లి పట్టణంలోని హనుమాన్ టెంపుల్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు నిర్వహించిన తిరంగా యాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. చందుపట్ల కీర్తి రెడ్డి గారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.జాతీయ జెండాలను చేతబూని బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపాలపల్లి పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది.అనంతరం డా. చందుపట్ల కీర్తి రెడ్డి గారు మాట్లాడుతూ, జాతీయ జెండా ప్రతి భారతీయుడి గౌరవానికి ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగానే మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తెలిపారు."హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కేవలం ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం మాత్రమే కాదు.. ప్రతి భారతీయుడి హృదయంలో దేశభక్తి భావాన్ని మరింత బలపరచడం" అని అన్నారు.ప్రతి కుటుంబం తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని, జాతీయ జెండాను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని డా. కీర్తి రెడ్డి గారు పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు."మన జెండా మన గౌరవం.. మన దేశం మన బాధ్యత. ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి.. ప్రతి హృదయంలో దేశభక్తి వెల్లివిరియాలి" అని ఆమె అన్నారు.హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ దేశభక్తి స్ఫూర్తితో ఘనంగా నిర్వహించాలని డా. చందుపట్ల కీర్తి రెడ్డి గారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాదరావు, జన్నే మొగిలి, ఎరుకల గణపతి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నాలుగో వార్డు కౌన్సిలర్ కన్నం యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్, పెండ్యాల రాజు గారు అర్బన్ అధ్యక్షులు సంపత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సేనాపతి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుప్పటి భద్రయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు దేశెట్టి గోపాల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిఫ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజనాయక్, లీగల్ సెల్ కన్వీనర్ చీర్ల అశోక్ రెడ్డి ఎండోమెంట్ కన్వీనర్ జయపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సామల మధుసూదన్ రెడ్డిజిల్లా కార్యదర్శి శివరాత్రి వేణు జిల్లా నాయకులు తుమ్మిటి రామిరెడ్డి తిరుపతి రవికుమార్ కంబాల రాజన్న పొన్నాల కొమరయ్య రవీందర్ అర్బన్ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి . బీజేవైఎం నాయకులు ఊడత నాగరాజు లాడే శివ భగవాన్ దేవేందర్ అలాగే రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, బూత్ అధ్యక్షులు, బీజేపీ కార్యకర్తలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్‌లో పండ్ల మార్కెట్‌కు స్థలం కేటాయించాలి

## 30 ఎకరాలు కేటాయించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి రైతు సంఘాల వినతి



హన్మకొండ, ఆగస్టు 12 హైదరాబాద్ ఎస్టేట్:
వరంగల్‌లో పండ్ల మార్కెట్ ఏర్పాటుకు 30 ఎకరాల స్థలం కేటాయించాలని కోరుతూ వివిధ రైతు సంఘాల నాయకులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వరంగల్ పండ్ల మార్కెట్ భూ సాధన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హన్మకొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి రైతుల సమస్యలను వివరించారు. గత ఐదేళ్లుగా వరంగల్‌లో పండ్ల విక్రయాలకు శాశ్వత మార్కెట్ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి రైతులు పండ్లను వరంగల్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. పండ్ల విక్రయాలకు శాశ్వత వేదిక లేకపోవడంతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వరంగల్ నగర పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని కేటాయించడం లేదా అవసరమైన భూమిని కొనుగోలు చేసి సుమారు 30 ఎకరాల్లో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. మార్కెట్ ఏర్పాటుతో రైతులకు పండ్ల విక్రయాలకు శాశ్వత వేదిక లభిస్తుందని, అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పండ్ల మార్కెట్ ఏర్పాటుకు అవసరమైన స్థల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క మొగిలి, ఏఐకేఎఫ్ జిల్లా నాయకుడు ఐత నగేష్, అఖిల భారత కిసాన్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు సుదమల్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలే శ్రేయస్కరం

## ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం.. వరికి బదులు స్వల్పకాలిక పంటలు



గీసుకొండ, ఆగస్టు 12 హైదరాబాద్ ఎస్టేట్:
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు వరికి బదులుగా స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు సూచించారు. నేల స్వభావం, తేమ, నీటి లభ్యతను బట్టి పెసర, మినుము, అలసంద, బొబ్బర్లు, ఉలవలు వంటి అపరాలు, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి నూనెగింజ పంటలు, కూరగాయలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. బుధవారం ఏలుకుర్తి గ్రామంలో రైతులు మోర్తాల నరసింహారావు, గాదం శ్యామ్ సాగు చేసిన పెసర పంటను ఆయన రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. చెరువుల్లోకి ఇప్పటివరకు నీరు చేరని పరిస్థితుల్లో వరి సాగుకు బదులుగా అందుబాటులో ఉన్న తేమ, నేల స్వభావానికి అనుగుణమైన పంటలను ఎంచుకోవాలని సూచించారు. తేమను నిల్వ ఉంచే రేగడి నేలల్లో మినుము (ఎల్‌బీజీ752, పీయూ31), సజ్జ (హెచ్‌హెచ్‌బీ67, పీహెచ్‌బీ3) అనుకూలమని తెలిపారు. తేలికపాటి చలుక నేలల్లో ఉలవలు (క్రిడా18ఆర్, పీడీఎం1), అలసందలు (టీపీటీ1, సీ152) సాగు చేసుకోవచ్చన్నారు. రెండు రకాల నేలలకు పెసర (ఎంజీజీ295, ఎంజీజీ348), నువ్వులు (శ్వేత, రాజేశ్వరి) అనుకూలమని వివరించారు. పప్పుధాన్యాల్లో పసుపుపచ్చ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు విత్తన శుద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కిలో విత్తనానికి మూడు గ్రాముల మాంకోజెబ్ లేదా కార్బెండజిమ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలని తెలిపారు. విత్తే సమయంలోనే భాస్వరం, పొటాష్ ఎరువులను వినియోగించాలని సూచించారు.
మండలానికి ఐదు క్వింటాళ్ల పెసర విత్తనాలు
ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీపై మండలానికి ఎంజీజీ295 రకం పెసర విత్తనాలు ఐదు క్వింటాళ్లు అందుబాటులోకి తీసుకురానున్నట్లు హరి ప్రసాద్ బాబు తెలిపారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని సాగు చేపట్టాలని రైతులను కోరారు. ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై మండలంలోని అన్ని వ్యవసాయ క్లస్టర్లలో ప్రతిరోజూ రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం గీసుకొండ క్లస్టర్‌లో వ్యవసాయ విస్తరణ అధికారి భరత్, ధర్మారంలో కావ్య, మొగిలిచర్లలో రాజేష్, కొమ్మాలలో అఖిల రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏలుకుర్తిలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జన్ను దివ్యభారతి, వ్యవసాయ విస్తరణ అధికారిణి పి. స్మిత, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమం, విద్యార్థుల సమస్యలపై పోలీస్ కమిషనర్‌తో చర్చ



హైదరాబాద్, ఆగస్టు 12: మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ కమిషనర్ శ్రీమతి సుమతి గారిని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెరుకు మణికంఠ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ యంగలి గోపి గౌడ్‌లు బుధవారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమం, విద్యార్థుల సమస్యలు, సామాజిక అంశాలకు సంబంధించిన పలు విషయాలపై కమిషనర్ సుమతితో వారు చర్చించారు. అనంతరం కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా సెక్రటరీ సురేష్, విద్యార్థి నాయకుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# 'ప్రెస్ ఫ్రీడమ్ పేరిట మీ ఇష్టం వచ్చినట్టు చేస్తారా?'- ఢిల్లీ హైకోర్టు

పత్రికా స్వేచ్ఛ ఎంత ముఖ్యమో, మీడియా బాధ్యత కూడా అంతే ముఖ్యమని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం మొబైల్ ఫోన్, మైక్రోఫోన్ ఉంటే ఎవరైనా తమను తాము "రిపోర్టర్"గా ప్రకటించుకుంటున్నారని, అయితే వారిలో చాలా మందికి శిక్షణ, వృత్తిపరమైన జవాబుదారీతనం లేదని కోర్టు వ్యాఖ్యానించింది. ఓ యూట్యూబ్ ఛానల్ కోసం పనిచేస్తున్న ఇద్దరు ఫ్రీలాన్స్ రిపోర్టర్లపై దాడి కేసులో ఇద్దరు నిందితులకు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ గిరీష్ కథ్‌పాలియా ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో అనుమతి లేకుండా నిర్మించారని ఆరోపణలు ఉన్న ఓ ప్రార్థనా స్థలం వద్ద వీడియో చిత్రీకరణ చేశారు. దీంతో స్థానికులు ఆగ్రహించి వారిని తరిమారు. వాళ్లు వెళ్లి ఓ బస్సు ఎక్కారు. స్థానికులు కూడా అదే బస్సు ఎక్కి ఆ రిపోర్టర్లను చితకబాదారు. అలా కొట్టిన వారిలో చాలామందిపై కేసులు నమోదు అయినా ఓ ఇద్దర్ని మాత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. వాళ్లకు బెయిల్ ఇచ్చే విషయమై కోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా ఈ ఘటనను లి"ప్రెస్ స్వేచ్ఛపై దాడి"లిగా అభివర్ణించిన ప్రాసిక్యూషన్ వాదనను కోర్టు పూర్తిగా అంగీకరించలేదు. బాధితులు గుర్తింపు పొందిన మీడియా సంస్థలకు చెందిన వారు కాదని కోర్టు గమనించింది. అలాగే ఈ ఘటనలో నిందితుల పాత్ర పూర్తిగా స్పష్టంగా లేదని పేర్కొంటూ వారికి బెయిల్ మంజూరు చేసింది.సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల విస్తరణతో మీడియా రంగంపై ఎక్కడా నియంత్రణ లేకుండా పోయిందని, ఈ రంగం అస్తవ్యస్థంగా తయారైందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ప్రెస్ స్వేచ్ఛను కాపాడుతూనే వృత్తిపరమైన జవాబుదారీతనం, నైతిక ప్రమాణాలు, చట్టపాలనను నిర్ధారించేలా తగిన నియంత్రణ వ్యవస్థను రూపొందించే అంశాన్ని చట్టసభలు పరిశీలించాల్సిన సమయం వచ్చిందని జస్టిస్ కథ్‌పాలియా అభిప్రాయపడ్డారు.కోర్టు వ్యాఖ్యలు ప్రస్తుతం డిజిటల్ మీడియా, యూట్యూబ్ జర్నలిజం, మీడియా నియంత్రణపై దేశవ్యాప్తంగా చర్చకు దారితీసే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు.

## కరణ్ కోట్ పిఎస్ పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి.

### 8 మంది అరెస్ట్ రూ.82,770 నగదు, పేక ముక్కలు స్వాధీనం.



హైదరాబాద్ స్టేట్ న్యూస్ ప్రతినిధి వికారాబాద్.

వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, IPS గారి ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం నమ్మదగిన సమాచారం మేరకు కరణ్ కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి నిర్వహించింది.టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు "నమ్మదగిన సమాచారం మేరకు నారాయణపూర్ గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై దాడి నిర్వహించాం. ఈ దాడిలో 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.82,770/- నగదు మరియు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నాం. పట్టుబడిన వారిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించాం" అని తెలిపారు. జిల్లాలో పేకాట, జూదం మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అన్వర్ పాషా హెచ్చరించింది.పేకాటకు పాల్పడిన వారిపై కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు.పేకాట స్థావరంపై సమర్థవంతంగా దాడి నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకుని నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా మరియు బృంద సభ్యులను జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఖూూ గారు అభినందించారు.

# ఉప్పాడ తీరానికి రక్షణ కవచం..

## పవన్ సమక్షంలో మద్రాస్ ఐఐటీతో ఒప్పందం



కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న సముద్ర కోత సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. తీవ్రమైన కోత కారణంగా దెబ్బతింటున్న ఈ తీరాన్ని పరిరక్షించేందుకు ప్రతిష్ఠాత్మక ఐఐటీ మద్రాస్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.ఈ ప్రాజెక్టు కింద రూ.323 కోట్ల వ్యయంతో ఉప్పాడ తీరంలో రక్షణ గోడ నిర్మించనున్నారు. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్డీఎంఎఫ్) ఆమోదంతో చేపట్టనున్న ఈ పనులకు ఐఐటీ మద్రాస్ సాంకేతిక సారథ్యం వహించనుంది. రక్షణ గోడకు అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) రూపకల్పనతో పాటు, నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను కూడా ఐఐటీ నిపుణులే చూడనున్నారు.ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్డీఎంఏ) నోడల్ ఏజెన్సీగా, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా వ్యవహరించనున్నాయి. తీర కోత తీవ్రత, సముద్రపు నీటి ప్రవాహాలు, అలల ప్రభావాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసి, ఉప్పాడ తీరానికి అత్యంత అనువైన, పటిష్ఠమైన రక్షణ చర్యలను ఐఐటీ బృందం సూచించనుంది.ఈ ఒప్పందంతో ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రక్రియ పూర్తయినందున, వచ్చే నవంబర్ నుంచి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ఉప్పాడ తీర ప్రాంత గ్రామాలు, మత్స్యకారుల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని అధికారులు భావిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఐఐటీ మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎ.సన్నాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఏపీ మారిటైమ్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ జి.వి.రాఘవరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వార్డ్ మెంబర్లకు సమాచారం లేకుండా గ్రామసభ నిర్వహించిన సర్పంచ్ ఉప సర్పంచ్ కార్యదర్శి

## వార్డ్ మెంబర్ హక్కులను పాల రాస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

## - మొగుళ్ళపల్లి మండల వార్డు మెంబర్ల ఫోరం డిమాండ్

## పంచాయతీరాజ్ చట్టం 2018 కు వ్యతిరేకంగా గ్రామసభ

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్

భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలం ఇప్పలపల్లి గ్రామంలో 11/08/2026 రోజున గ్రామసభ నిర్వహించడం జరిగింది ఈ యొక్క గ్రామ సభకి ప్రజాప్రతినిధులు అయిన వార్డు సభ్యులకి ముందస్తు ఎలాంటి సమాచారం లేకుండా ఏజెండా అంశాలతో కూడిన పుస్తకాన్ని వార్డు మెంబర్ల వద్దకు పంపకుండా వారి సంతకాలు తీసుకోకుండా సర్పంచ్ ఉప సర్పంచ్ మరియు పంచాయతీ కార్యదర్శి గార్లు గ్రామసభ నిర్వహించడం జరిగింది. పంచాయతీరాజ్ చట్టం 2018 ఈ వ్యతిరేకంగా గ్రామసభ నిర్వహించడం జరిగింది. కావున సర్పంచ్ ఉప సర్పంచ్ కార్యదర్శులపై సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోగలరని ఎంపీడీవో గారికి మండల వార్డు మెంబర్ల ఫోరం తెలియజేయడం జరిగింది (ఇప్పలపల్లి 1వ వార్డు మెంబర్ దూడపాక శ్రీధర్ మరియు దూడపాక శ్రీకృష్ణ 6వ వార్డ్ మెంబర్ బాధితులు) ఈయొక్క కార్యక్రమంలో మొగుళ్ళపల్లి మండల వాడు మెంబర్ల ఫోరం అధ్యక్షులు చిలుకుమారి శ్రీనివాస్ గౌరవాధ్యక్షులు బండారి కుమార్, ప్రధాన కార్యదర్శ దూడపాక శ్రీకృష్ణ, మరియు మొగుళ్ళపల్లి మండల వార్డు సభ్యులు మహేష్ లు పాల్గొన్నారు.



## ధర్మన్నగూడ నుంచి పెద్దతుండ్ల కు పోయే రహదారికి మహద్దేశా మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం కానుంది

హైదరాబాద్ ఎస్టేట్ యాచారం ప్రతినిధి రామాచారి ఆగస్టు 12

రంగారెడ్డి జిల్లా యాచారం మండలం ధర్మన్నగూడ ఉప సర్పంచి నాగరాజు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని కలిసి గ్రామంలోని సమస్యలను చెప్పడం జరిగింది కురుమ సంఘం భవనము అండర్ డ్రైనేజ్ సీసీ రోడ్లు అందులో ముఖ్యంగా ధర్మన్నగూడ నుండి పెద్ద తుండ్ల రోడ్డు భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు కావచ్చిన ఇప్పటికీ రజాకర్ల కాలం నాటి మట్టిబాటని వాడుకలో ఉంది అయినప్పటికీ గ్రామ ప్రజలు అదే దారిని వాడుకుంటున్నారు ధర్మన్నగూడ కు ఇప్పుడైనా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మల్రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో బీటీ రోడ్ వేయాలని గ్రామ ఉపసర్పంచ్ నాగరాజు సత్తు ప్రదీప్ రెడ్డి అచ్చని రాజు రావుల సురేష్ తో కలిసి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది లెటర్ ఇచ్చిన వెంటనే రోడ్డు పనులు త్వరలోనే మొదలవుతాయని రోడ్డుకు సంబంధించిన డి ఈ ని కలవమని ఫోన్ చేసి పంపించడం జరిగింది డి ఈ ని కలిసి ధర్మన్నగూడ టు పెద్ద తుండ్ల రోడ్డు విషయంపై మల్రెడ్డి రంగారెడ్డి త్వరలోనే రోడ్డు పనులు మొదలు పెడత మని చెప్పడం జరిగింది



# శ్రీ శ్రీ శ్రీ బంగారు పోచమ్మ రేణుక ఎల్లమ్మ దేవాలయయం ఆధ్వర్యంలో ఘనంగా తొట్టెల ఊరేగింపు కార్యక్రమం

మన్సురాబాద్ జడ్జెస్ కాలనీ ఫేస్ 1లోని శ్రీశ్రీశ్రీ బంగారు పోచమ్మ రేణుక ఎల్లమ్మ దేవాలయ కమిటీ, నిర్మాణ కమిటీ, ఉభయాంజనేయ స్వామి కమిటీ, గోశాల కమిటీ, కాలనీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, కాలనీ యూత్ ఆధ్వర్యంలో బోనాల జాతరను పునస్కరించుకొని తొట్టెల ఊరేగింపు కార్యక్రమం చెరుకూరి అపార్ట్మెంట్స్ నుండి దేవాలయాల వరకు ఎంతో అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా పోతురాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు, డప్పు వాయిద్యాలతో శోభాయాత్ర కనుల పండుగగా జరిగింది. ఈ ఊగిరేగింపు కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు, పలువురు ప్రముఖులు అతిథులుగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారికి నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ తమను ఆహ్వానించిన నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తదనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన అతిథులకు ప్రత్యేకత కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా బోనాల జాతరలో భాగంగా తొట్టెల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. కాలనీ వాసులందరి ఐక్యమత్యంతో ప్రతి పండుగను ఎంతో వేడుకగా జరుపుకుంటామని తెలిపారు. తమకు అన్నింటిలో సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందించే మా కాలనీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన చొరవతోనే, కృషితోనే, ప్రోత్సాహంతోనే ఈరోజు తాము దేవాలయ నిర్మాణం గానీ, బోనాల జాతర గాని ఇంత దిగ్విజయంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో ప్రతి సంవత్సరం ఇంతకంటే ఘనంగా బోనాల జాతరని నిర్వహిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అట్లాగే ముఖ్యంగా తమకు రెండు రోజులుగా భద్రత కల్పించిన పోలీస్ అధికారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ న్యూ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బకతట్ల శ్రీశైలం యాదవ్, కాలనీ కమిటీ ప్రధాన కార్యదర్శి చింతల యాదయ్య, కోశాధికారి సోమిరెడ్డి, నిర్మాణ కమిటీ అధ్యక్షులు మారోజు షణ్ముఖ చారి, బంగారు పోచమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షులు మోడల బిక్షపతి సాగర్, శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షులు చింతల యాదయ్య , శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు దంతూరి బిక్షపతి గౌడ్, గోశాల కమిటీ అధ్యక్షులు గార్లపాటి గోవింద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు తాల్ల సుకుమార్, యేల్లు మాధవ రెడ్డి, కోశాధికారులు రాపోలు గోపీనాథ్, బి. చెన్నయ్య, ఉపాధ్యక్షులు బొంగు కృష్ణ , పి .మోహన్ రావు, పి .శివ ముకాడే, కాళ్ళ సుమంత్, చల్లా రమేష్, పి .సతీష్, గవ్వ వెంకటరెడ్డి, సాగర్ల శంకర్, జగదీష్ యాదవ్, మహిళా కమిటీ సభ్యులు ఎస్. కృష్ణమ్మ, అశోక్ కుమారి, యం .వెంకటమ్మ , బి లావణ్య, సుగుణమ్మ, గోవర్ధనమ్మ , డి .మహేశ్వరి, హెచ్ .కె ఊర్మిళ, ఎం. విజయలక్ష్మి , సాయి ప్రియాంక ,ఉమా, మొయినమ్మ , సునీత, లలిత, శ్రీలత , యువకులు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాకినాడ కలెక్టరేట్, జిల్లా పరిషత్ సమీపంలోని సీబీసీఎన్‌సీ వివాదాస్పద స్థలంలో ఆక్రమణలను అడ్డుకోవాలి

### - కబ్జాదారుడు ఆర్‌డీఓ పేరు ఉపయోగించడం బరితెగింపుకు నిదర్శనం

### - తక్షణం అక్రమ ఆక్రమణలను అడ్డుకోవాలి:

### - రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షుడు డా. పిట్టా వరప్రసాద్

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాకినాడ ఆగస్టు 12, 2026:

కాకినాడ కలెక్టరేట్, జిల్లా పరిషత్ కార్యాలయాలను ఆనుకుని ఉన్న సీబీసీఎన్‌సీ (జదీజచీజ) వివాదాస్పద స్థలంలో జరుగుతున్న ఆక్రమణలను తక్షణమే అడ్డుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు.వివాదంలో ఉన్న సి బి సి ఎన్ సి సంబంధించిన స్థలంలో కొందరు వ్యక్తులు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారని, అంతేకాకుండా ఆర్‌డీఓ పేరు, హోదాను ఉపయోగిస్తూ తమ చర్యలకు అధికారుల మద్దతు ఉన్నట్లుగా ప్రచారం చేయడం అత్యంత ఆందోళనకరమైన విషయం అని ఆయన పేర్కొన్నారు. ఇది కబ్జాదారుల బరితెగింపుకు నిదర్శనమని విమర్శించారు.





వివాదాస్పద స్థలానికి సంబంధించి పూర్తి రికార్డులను పరిశీలించకుండా ఎలాంటి నిర్మాణాలు, కంచెలు లేదా ఇతర ఆక్రమణలకు అనుమతి ఇవ్వకూడదని ఆయన కోరారు. స్థలానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, హక్కులు, గతంలో జారీ చేసిన ఉత్తర్వులు, కోర్టు వివాదాలు మరియు ప్రస్తుత స్థితిగతులను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.అధికారుల పేర్లను దుర్వినియోగం చేస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే రెవెన్యూ, మున్సిపల్, పోలీసు శాఖల సమన్వయంతో స్థలాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డా. పిట్టా వరప్రసాద్ కోరారు. ప్రభుత్వ స్థలాలు, ప్రజా ఆస్తులు కబ్జాలకు గురైతే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై కాకినాడ జిల్లా కలెక్టర్ తక్షణం జోక్యం చేసుకుని సమగ్ర విచారణకు ఆదేశించి, వివాదాస్పద స్థలంలో జరుగుతున్న అన్ని రకాల ఆక్రమణలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.అధికారుల పేర్లను ఉపయోగించి ఎవరైనా అక్రమ చర్యలకు పాల్పడితే, ఆ విషయాన్ని కూడా విచారించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) తరపున డా. పిట్టా వరప్రసాద్ కోరారు.

# 'డీ కంపెనీ' కన్నా ప్రమాదకరం.. ఆర్జీవీ 'పోలీస్ కంపెనీ' కథ ఇదే!

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన తదుపరి చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ టీ-సిరీస్‌తో కలిసి ఆయన 'పోలీస్ కంపెనీ' అనే సినిమాను తెరకెక్కించబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "ఇట్ ఈజ్ మోర్ డేంజరస్ దేన్ డీ కంపెనీ" (ఇది డీ కంపెనీ కన్నా ప్రమాదకరం) అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమా రాబోతోంది. ఈ చిత్రంలో పోలీస్ అధికారి పాత్రలో నటుడు హర్షవర్ధన్ రాణే నటించనున్నారు. ఈ సినిమా వివరాలను 'ఎక్స్' (ట్విట్టర్)లో పంచుకుంటూ వర్మ ఆసక్తికరమైన విషయాలు తెలిపారు. "పోలీసు అనేది ఒక వ్యవస్థ, అండర్ వరల్డ్ కంపెనీ అనేది డబ్బు సంపాదించే సంస్థ. కానీ, ఒక వ్యవస్థకు అదనపు అధికారాలు ఇచ్చినప్పుడు, అది కూడా ఒక కంపెనీగా మారిపోతుంది" అంటూ తన సినిమా కాన్సెప్ట్‌ను వివరించారు. 1990ల చివరలో, 2000ల ప్రారంభంలో ముంబైలో పెరిగిపోయిన గ్యాంగ్ కార్యకలాపాలను అరికట్టడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీస్ స్క్వాడ్ స్ఫూర్తితో ఈ కథ రాబోతోందని స్పష్టం చేశారు.



సినిమా నేపథ్యాన్ని వివరిస్తూ, దావూద్ ఇబ్రహీం తన ప్రత్యర్థి గ్యాంగ్‌లను అంతమొందించి 'డీ కంపెనీ'ని స్థాపించి దుబాయ్ పారిపోయాడని ఆర్జీవీ గుర్తుచేశారు. ఆ తర్వాత డీ కంపెనీ కార్యకలాపాలను చోటా రాజన్ చూసుకునేవాడని తెలిపారు. అయితే, వారిద్దరి మధ్య వచ్చిన విభేదాలతో ముంబై అండర్ వరల్డ్‌లో ఒక శూన్యత ఏర్పడిందని, ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి యూపీ, బీహార్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుంచి వచ్చిన యువకులతో కొత్త గ్యాంగ్‌లు పుట్టుకొచ్చాయని వర్మ పేర్కొన్నారు. ఈ అరాచకాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఒక స్పెషల్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసిందని, ఆ స్క్వాడ్ 1997 నుంచి 2004 మధ్య కాలంలో 300 మందికి పైగా గ్యాంగ్‌స్టర్లను హతమార్చిందని తెలిపారు. 'పోలీస్ కంపెనీ' చిత్రం ఆ స్పెషల్ స్క్వాడ్ కథేనని, అందులో కీలక సభ్యుడైన పోలీస్ ఆఫీసర్ దయా నాయక్ పాత్ర స్ఫూర్తితోనే ప్రధాన పాత్రను తీర్చిదిద్దినట్లు వర్మ చెప్పారు. ఈ పాత్రను హర్షవర్ధన్ రాణే పోషిస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రంలో ఇంకా చాలా మంది ప్రముఖ నటులు ఉన్నారని, వారి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. గతంలో 'సత్య', 'కంపెనీ' వంటి చిత్రాలతో ముంబై అండర్ వరల్డ్‌ను వెండితెరపై ఆవిష్కరించిన వర్మ, ఇప్పుడు పోలీసుల కోణంలో మరో పవర్‌ఫుల్ కథతో రాబోతుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు పెరిగాయి.

# మరింత ఫిట్‌గా కావ్య థాపర్& న్యూ లుక్ వైరల్!

తెలుగు చిత్రసీమలో తన అందం, అభినయంతో ఆకట్టుకున్న కథానాయిక కావ్య థాపర్ తాజాగా షేర్ చేసిన ఫోటోలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. కెరీర్ ప్రారంభంలో కాస్త బొద్దుగా కనిపించిన ఈ బ్యూటీ, ఇప్పుడు బరువు తగ్గి ఎంతో సన్నగా, ఫిట్‌గా మారిపోయింది. ఆమె కొత్త మేకోవర్ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఎంతో కాన్ఫిడెంట్‌గా స్టైలిష్ డ్రెస్సుల్లో ఆమె దిగిన ఫోటోషూట్ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. తాజా ఫోటోషూట్‌లో కావ్య థాపర్ ఎంతో చిక్ అండ్ స్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నారు. ప్రింటెడ్ బ్లూ మ్యాక్సీ డ్రెస్‌తో పాటు వేరొక పిక్‌లో ఫ్లోరల్ క్రాప్ టాప్, హై-స్లిట్ స్కర్ట్ ధరించి ఎంతో గ్లామరస్‌గా మెరిసిపోయారు. పర్ఫెక్ట్ ఫిట్‌నెస్‌తో పాటు గోల్డ్ బ్యాంగిల్స్, హై హీల్స్ జతచేసి ఇచ్చిన ఫ్యాషన్ పోజులు ఆమెలోని కొత్త ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని స్పష్టంగా చూపుతున్నాయి. ఈ న్యూ లుక్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. 'నేను రెడీ' ప్రమోషన్లలో సందడి: 2024లో వచ్చిన 'విశ్వం' సినిమా తర్వాత కావ్య థాపర్ నటించిన లేటెస్ట్ చిత్రం 'నేను రెడీ'. ఈ సినిమా ఆగస్టు 28న విడుదల కాబోతుండటంతో, ఆమె ప్రమోషన్ కార్యక్రమాల్లో జోరుగా పాల్గొంటున్నారు. ఈ ఈవెంట్లకు హాజరైన కావ్యను చూసిన ఫ్యాన్స్ ఒక్కసారిగా షాక్ అయ్యారు. గతంతో పోలిస్తే మరింత స్లిమ్‌గా, మునుపెన్నడూ లేనంత గ్లామరస్‌గా కనిపిస్తూ అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంటున్నారు.

సినిమా అవకాశాలు, కెరీర్ గ్రాఫ్: తొలినాళ్లలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కావ్య, తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ అవకాశాలు అందుకుంది. అయితే ఈ మధ్య కాలంలో ఆమెకు అవకాశాలు కాస్త తగ్గడంతో, తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తి మేకోవర్ అయ్యారు. ఈ కొత్త అవతారంతో ఆమె మళ్లీ వరుస ప్రాజెక్టులతో బిజీ కావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. గ్లామర్ ప్రపంచంలో ఫిట్‌నెస్‌కు ఉన్న ప్రాధాన్యతను గుర్తిస్తూ కావ్య థాపర్ సాధించిన ఈ ట్రాన్స్‌ఫార్మేషన్ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. రాబోయే 'నేను రెడీ' చిత్రం ఆమె కెరీర్‌కు మంచి మైలేజ్ ఇస్తుందని, ఈ కొత్త గ్లామరస్ లుక్ మరింతమంది దర్శకుల దృష్టిని ఆకర్షిస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. కావ్య థాపర్ లేటెస్ట్ పిక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.



# రుక్మిణీ వసంత్ మలయాళ ఎంట్రీ..

# షూటింగ్ స్టార్ట్!




ఒక్క సినిమాతో మంచి సక్సెస్ అందుకున్నారు అంటే అది హీరోకైనా, హీరోయిన్ కైనా వరుసగా అవకాశాలు వచ్చి పడతాయి. అందులో భాగంగానే మరీ ముఖ్యంగా ఈ మధ్యకాలంలో యంగ్ హీరోయిన్స్ తమ అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంటూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. అలాంటి వారిలో రుక్మిణి వసంత్ కూడా ఒకరు. సప్త సాగరాలు దాచేయెల్లో అనే సినిమాతో వెండితెరకు పరిచయమైన రుక్మిణీ వసంత్.. తెలుగులో తొలిసారి నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా నటించిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. అయితే ఈ సినిమా పెద్దగా విజయాన్ని అందుకోలేదు. ఆ తర్వాత తమిళ్ లో శివ కార్తికేయన్ సరసన మదరాసి అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా సక్సెస్ కాలేదు. అయితే ఈ సినిమా ప్రమోషన్స్ సమయంలో డైరెక్టర్ ఈమెకు ఇచ్చిన ఎలివేషన్ కారణంగా ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చింది రుక్మిణి వసంత్. సరైన క్యారెక్టర్ పడితే తనను తాను నిరూపించుకోవడానికి ఎప్పుడూ సిద్ధమే అని కాంతారా చాప్టర్ వన్ చిత్రంతో నిరూపించింది. ఇందులో కీలకపాత్ర పోషించిన రుక్మిణి వసంత్.. సినిమా మొత్తం సాఫ్ట్ క్యారెక్టర్ తో ఆకట్టుకొని.. క్లైమాక్స్లో ఒక్కసారిగా విలనిజం కనబరిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. పైగా కొన్ని కొన్ని సన్నివేశాలలో హీరో రిషబ్ శెట్టి నే డామినేట్ చేసింది అంటే.. తన నటనతో ఏ విధంగా మెప్పించిందో అర్థం చేసుకోవచ్చు. అలాంటి ఈమె ప్రస్తుతం ప్రముఖ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న డ్రాగన్ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇదిలా ఉండగా ఇప్పుడు మరో క్రేజీ ఆఫర్ లభించింది .ఈ విషయాన్ని తన అధికారిక ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకుంది. నివిన్ పౌలీ సరసన హీరోయిన్ గా ఛాన్స్ కొట్టేసి.. మాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యింది. అందులో భాగంగానే ఈమె ఆన్ సెట్ కి వెళ్లిన సందర్భంగా క్లాప్ బోర్డు పట్టుకొని ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. మొత్తానికి అయితే రుక్మిణి వసంత్ మాలీవుడ్ లోకి అడుగుపెట్టడంతో అభిమానులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే తాను ఎంతో కాలంగా అభిమానిస్తున్న మాలీవుడ్ సినీ పరిశ్రమలో అవకాశం లభించడంతో తనకు చాలా ప్రత్యేకంగా అనిపిస్తుంది అంటూ రుక్మిణి చెప్పుకొచ్చింది. ఆ ప్రపంచంలో ఒక చిన్న స్థానం సంపాదించడం తనకు ఒక ముఖ్యమైన తొలి అడుగు అని , ఈ ప్రాజెక్టులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి కూడా ధన్యవాదాలు తెలిపింది. ఈ సినిమాలో నివిన్ పౌలీ హీరోగా నటించడమే కాకుండా తన సొంత బ్యానర్ అయిన పౌలీ జూనియర్ పిక్చర్స్ బ్యానర్ పై మార్టిన్ ప్రాక్కాట్ ఫిలిమ్స్ తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో మలయాళ నటుడు అజు వర్గీస్ కీలక పాత్ర పోషిస్తున్నారు. గతంలో తమలయాల సూపర్ హిట్ కామెడీ మూవీ జయ జయ జయ జయ హే అనే చిత్రానికి సహా రచయితగా పనిచేసిన నషీద్ ఫామీ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు.

# వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు అండగా ఉండటం కంటే అదృష్టం లేదు: నాగార్జున

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూసుకునే అవకాశం దక్కడం కంటే అదృష్టం మరొకటి లేదని ప్రముఖ నటుడు నాగార్జున అన్నారు. చిన్నతనంలో తల్లిదండ్రులు తమను ఎలా చూసుకున్నారో.. పెద్దయ్యాక వారిని కూడా అలాగే చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని చెప్పారు. దర్శకుడు ఉదయ్ చౌహాన్ తెరకెక్కించిన 'పళ్లబురుసు' సినిమా ప్రీ-రిలీజ్ వేడుకలో నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల సంరక్షణపై మాట్లాడారు. చిన్నప్పుడు భయపడితే చేయి పట్టుకుని ధైర్యం చెప్పారని.. జ్వరం వచ్చినప్పుడు దగ్గరుండి చూసుకున్నారని గుర్తుచేశారు. కరెంట్ పోయినా భయపడిన సమయంలో అండగా నిలిచారని తెలిపారు. "వాళ్లు మన కోసం ఉన్నట్టే.. మనం పెద్దయ్యాక వాళ్ల కోసం ఉండకూడదా?" అని ప్రశ్నించారు. తన భార్య అమలను ఉదాహరణగా చెబుతూ.. ఆమె 88, 90 ఏళ్ల వయసున్న తల్లిదండ్రులను ఎంతో శ్రద్ధగా చూసుకుంటున్నారని నాగార్జున తెలిపారు. "తల్లిదండ్రులను చూసుకునే అవకాశం నీకు దక్కడం చాలా అదృష్టం" అని ఆమెతో తరచూ చెబుతుంటానన్నారు. తల్లిదండ్రుల సంరక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. 'పళ్లబురుసు' కథను దర్శకుడు ఉదయ్ తనకు ఎంతో ఆసక్తికరంగా చెప్పారని నాగార్జున తెలిపారు. సినిమాలో సుధాకర్‌రెడ్డి, మురళీధర్‌గౌడ్ సహా నటీనటులంతా అద్భుతంగా నటించారని ప్రశంసించారు. చిత్రబృందం ఎంతో సమన్వయంతో పనిచేసినట్లు కనిపించిందన్నారు. ప్రేమతో తీసిన



సినిమా ఎప్పుడూ విఫలం కాదని చెప్పారు. సినిమాను తాను ఇప్పటికే చూశానని నాగార్జున తెలిపారు. సినిమా చూస్తూ బాగా నవ్వానని.. అదే సమయంలో కళ్లలో నీళ్లు కూడా వచ్చాయని చెప్పారు. మనసుకు హత్తుకునే భావోద్వేగాలతో పాటు వినోదం కూడా సినిమాలో ఉందన్నారు. చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని ఆకాంక్షించారు.

# సినిమా ఇమేజ్ మాత్రమే కాదు..

## ప్రజల్లో మార్పు కోరికే విజయ్‌ని సీఎంను చేసింది: విశాల్



తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ విజయం సాధించడంపై నటుడు విశాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో శివాజీ గణేశన్, కే భాగ్యరాజ్, అమితాబ్ బచ్చన్, మిథున్ చక్రవర్తి వంటి దిగ్గజాలు రాజకీయంలో విఫలమైనప్పటికీ, విజయ్ మాత్రం రాణించడానికి ఆయన పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకం, బలమైన మార్పు కోరికే కారణమని విశాల్ అభిప్రాయపడ్డారు. ఇటీవల సీఎం విజయ్‌ని కలిసిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ.. ఆయన హోదా మాత్రమే మారిందని, మనిషిగా ఆయనలో ఏమాత్రం మార్పు రాలేదని తెలిపారు. ఎన్నికల ప్రచార ముగింపు రోజున "మీ తల్లిదండ్రులకు, ఇళ్లలోని పెద్దలకు చెప్పి ఒక్కసారి నాకు ఓటు వేయమని కోరండి" అని విజయ్ చేసిన పిలుపు ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపిందని విశాల్ పేర్కొన్నారు. నటుడిగానే కాకుండా ప్రజలతో ఏర్పరచుకున్న కనెక్టివిటీ ఆయనను ఈ స్థాయికి చేర్చిందన్నారు. ఇక విశాల్ తొలిసారిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన 'మగుడం' (తెలుగులో 'మకుటం') చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.







